విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

స్పందన దరఖాస్తులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: స్పందన దరఖాస్తులకు అర్థవంతమైన పరిష్కారం చూపా లని సంబంధిత అధికార్లను జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి ఆదేశించారు.సోమవారం స్థానిక కలెక్టరేటు స్పందన సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన దరఖాస్తులను జిల్లా జాయింటు కలెక్టరు ఎస్. రామ్ సుందర్ రెడ్డితో కలసి జిల్లా కలెక్టరు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి మన మీద నమ్మకంతో వారి సమస్యల పరిష్కారానికి వస్తారని, దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు త్వరితగతిన చక్కని పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి అన్నారు. సోమవారం స్పందన ద్వారా 186 ధరఖాస్తులు అందాయి.జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె. కృష్ణవేణి, డి.ఎల్.డి.ఓ కె.సి.హెచ్ అప్పారావు, డియస్పి బి. శ్రీనాథ్ అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరిం చారు. ఏ శాఖకు సంబంధించిన అర్జీలను ఆ శాఖ అధికారులు తొలుత స్వీక రించి, అర్జీదారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్య క్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధులు ట్రిబ్యునల్ మెంబరు మేళం దుర్గా ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 213 అర్జీల స్వీకరణ

- అర్జీల పరిష్కారంలో నాణ్యతకే ప్రాధాన్యత
- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: స్పందనలో అందిన అర్జీల పరిష్కారంలో ఫిర్యాదుదారుల సంతృప్తిస్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం - జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, డిఆర్వో ఎవిఎస్ఎస్ మూర్తి, జడ్పి సిఇఓ రవికుమార్, ఆర్డిఓ కె. పెంచల కిషోర్, జేడి వ్యవసాయశాఖ రామకృష్ణలతో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం 213 అర్జీలు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను ఎంతో ఓపిగ్గా ఆలకించి వాటి పరిష్కారం నిమిత్తం సంబంధిత జిల్లా అధికారులతో నేరుగా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఆదేశాలుజారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో అర్జీలను పరిష్కరిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను నిర్ణీత సమయంలో పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రహదారులు అభివృద్ధి చేయాలి



విశాలాంధ్ర-టీ నరసాపురం: మండలంలో అధ్వాన్నంగా వున్న రహదారులు అభివృద్ధి చేయాలని సామాజిక కార్యకర్త సయ్యద్ నాసర్ పాషా డిమాండ్ చేశారు. రహదారులు అభివృద్ధి చేయాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ జెవి సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని టి నరసాపురం బంధంచర్ల, గండిగూడెం రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయని తెలిపారు. టి నరసాపురం ప్రధాన కూడలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెంటర్లో బంధం చర్ల కు వెళ్లే ప్రధాన ద్వారం వద్ద డ్రైనేజీ లేక రోడ్డుపై మురుగునీరు చేరి చెరువులను తలపిస్తున్నాయని తెలిపారు. రోడ్లపై నీరు నిల్వ వుండడంతో ఈగలు, దోమలు చేరి విష జ్వరాలు ప్రబలే అవకాశం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీ లు ఏర్పాటు చేసి విష జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులు బస్సుపాస్‌లు వినియోగించుకోవాలి

- డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి



విశాలాంధ్ర - గణపవరం: వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు దాతల సహకారంతో అందించే ఉచిత బస్ పాసులను వినియో గించుకోవాలని తాడేపల్లిగూడెం ఆర్టిసి డిపో మేనేజర్ ఏలూరి సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం గణపవరం మండలం పిప్పర జిల్లా పరిషత్ హై స్కూల్లో చదువుతున్న విద్యార్థి విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. జయ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ బస్సు పాస్ లును హై స్కూల్ పూర్వ విద్యార్థి ప్రస్తుత ఆర్టీసీ ఉద్యోగి ముప్పర్తిపాడు గ్రామానికి చెందిన కోపూరి చినరామిరెడ్డి ఆర్థిక సౌజన్యంతో 200 మంది విద్యార్థులకు బస్సు పాసులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఆర్టీసీ సూపర్వైజర్ డి. విజయ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు అమానుషం

విశాలాంధ్ర - వేలేరుపాడు : మహిళల పట్ల దారుణంగా వ్యవహరించిన మణిపూర్ ఘటనను ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిట్ట ప్రసాద్, కారం దారయ్య సోమవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఎంతో గౌరవించాల్సిన మహిళలను హింసిస్తున్న వారిని కఠినంగా శిక్షించా లన్నారు. గిరిజనులు అంతలా వేధిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సరైన చర్య కాదన్నారు. వెంటనే బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన M/s. Hinduja Housing Finance Ltd., (HHFL)విజయవాడ బ్రాంచివారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నాక్లయింటు వద్దకు ఏలూరుజిల్లా, నూజివీడు(మం), మర్రికుంట గ్రామ కాపురస్తులు జూట్రు వెంకటేశ్వరరావు గారి కుమారుడు చంద్రశేఖర్ గారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని చింతలపూడి(మం), యండపల్లి గ్రామ కాపురస్తులు తాటిచెట్టు రాము గారి వద్ద నుండి ది.21-06-2023న స్థిరాస్తి విక్రయ దస్తావేజు నెం.5444/2023 యస్.ఆర్.ఓ. చింతలపూడి ద్వారా క్రయం పొంది సర్వ హక్కులతో అనుభవించు చున్న ఆస్తిపై ఋణంకొరకు నాక్లయింటును సంప్రదించియున్నారు. సదరు ఆస్తి తాటిచెట్టు రాముగారికి దఖలు ద.నెం.2097/2022 యస్.ఆర్.ఓ. చింతలపూడి ద్వారా సంక్రమించినదని, అట్టి ఆస్తిని పై దస్తావేజు 5444/2023గా జూట్రు చంద్రశేఖర్ గారికి విక్రయించి రిజిష్టర్ చేసియున్నారు. సదరు చంద్రశేఖర్ గారు అట్టి ఆస్తికి చెందిన 2097/2022గల దాఖ్లు మెంటు పోయినదని, దొరకలేదని తెలిపి నాక్లయింటును ఋణంకొరకు సంప్రదించి యున్నందున సదరు షెడ్యూలు ఆస్తిపై గాని, పోయిన దస్తావేజుపై గాని, మంజూరుచేయు ఋణముపై గాని ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు,క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 7రోజుల లోపు వ్రాత పూర్వ కంగా ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయవలెనని గడువులోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్పేచి ఆస్తిగా భావించి లోను మంజూరుచేయబడును మరియు గడువు అనంతరమువచ్చు అక్షేపణలు, వగైరాలు నాక్లయింటు హక్కులను బైండుచేయబడవు.

షెడ్యూలు: ఏలూరు డి॥, చింతలపూడి సబ్.డి॥ & (మం), యండపల్లి గ్రామం తాలూకు రీ-సర్వే నెం.73 దాఖలా య.0-10సెంట్లు లేక చ.గ.484లు నివేశన స్థలము నకు **హద్దులు. తూర్పు:**పంచాయితీ రోడ్డు, **దక్షిణం:** యండపల్లి నుండి రాఘవపురం పోవు ఆర్ & బి రోడ్డు మార్జిన్, **పడమర:** పంచాయితీ రోడ్డు, **ఉత్తరం:** తాటిచెట్టు రాముగారి స్థలం.

సాంబేలు ఆంజనేయ ప్రసాద్, అడ్వకేట్
AP LAW FIRM, డోర్.నెం.54-15-13, మధు టవర్స్, ఫ్లాట్ నెం. ఎఫ్.ఎఫ్.2, భారతీ నగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ ప్రక్కన, విజయవాడ-8. సెల్: 9949533987
విజయవాడ. తేది: 24-07-2023

పోరాటాలతో వ్యవసాయ కార్మిక సమస్యలు పరిష్కారం

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా మహాసభ

విశాలాంధ్ర-ఉండి: పోరాటాల ద్వారా వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా 25వ మహాసభ ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో జరిగింది. ఈ మహాసభకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సనపల శ్రీను, ఉల్లింకల జయకృష్ణ, సిహెచ్ సరోజిని అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ మహాసభలో కొనాల భీమారావు, బండి వెంకటేశ్వరరావు, మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులు నివాసం ఉంటున్న ప్రదేశాలలో మౌలిక సదుపాయాల కోసం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఎన్నో పోరాటాలు నిర్వహించి సముద్ర తీర ప్రాంత భూములను పేదలకు పంపిణీ చేయడంలో కీలకపాత్ర వహించిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం బలోపేతానికి వ్యవసాయ కార్మికులందరూ కృషి చేయాలన్నారు. ఆగస్టు 24, 25, 26 తేదీలలో బాపట్లలో జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలలో జిల్లా నుండి వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, తదితరులు ప్రసంగించారు.

మణిపూర్ ఘటనలు సిగ్గుచేటు

-ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు

విశాలాంధ్ర -భీమవరం : మణిపూర్ లో ఇద్దరు గిరిజన మహిళలను వివస్త్రలను చేసి ఊరే గించిన ఘటన సభ్య సమాజాన్ని సిగ్గుతో తల వంచుకునేలా చేసిందని ఘటనకు మోడీ సర్కారు బాధ్యత వహించాలని దోషులను కఠినంగా శిక్షించాలని ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలను నిరసిస్తూ ఐఎఎల్ ఆధ్వర్యంలో డీఎన్నార్ న్యాయ కళాశాల వద్ద న్యాయ విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ ఘటనలకు బాధ్యత వహించి మోడీ సర్కారు రాజీనామా చేయాలన్నారు. మణిపూర్ లో రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఎల్ నాయకులు అశోక్ కుమార్, చిత్రభాను, వాణీ, వీర్రాజు, భాస్కర రావు, విద్యార్థులు తేజ, డి.అనిత, పూజిత, జగదీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-చింతలపూడి: విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ పిలుపులో భాగంగా మంగళశారం జరిగే విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కోకన్వీనర్ తుర్లపాటి రాజు, ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా కోశాధికారి కంభం ప్రసన్నకుమార్, టిఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు పల్లె మున్న పిలుపునిచ్చారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని, వృత్తి విద్యలతో సహా ప్రైమరీ విద్య నుండి ఉన్నత విద్య వరకు ప్రభుత్వ రంగంలోనే నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం నేడు అన్ని ప్రైవేట్ కార్పొరేట్, ప్రభుత్వ విద్యా సంస్థలు బందులో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు బొల్లవరపు విజయ్ శేఖర్ పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలి : ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: స్వచ్ఛభారత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేసి సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ ఏపీ గ్రామపంచాయతీ, స్వచ్ఛభారాత్ కార్మికుల 12 నెలలుగా పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వం ఇచ్చిన 680 జి. ఓ ప్రకారం రూ. 10 వేలు జీతాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛభారత కార్మికులను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వీరికి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి, వీరికి రెగ్యులర్ గా నెల నెల జీతాలు విడుదల చేయాలన్నారు. వీరికి కావలసిన పరికరాలు అందించాలనీ, మెడికల్ అలవెన్స్ ఇవ్వాలనీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మికులు ముల్లంగి రాంబాబు, బర్రె శ్రీను, పులిపాక, తిరుపతయ్య, గోవాడ, రాజు,శేఖర్, జయరాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టి నరసాపురం పంచాయతీ లోని ఇందిరా కాలనీకి చెందిన దొంత నాగేశ్వరరావు(40) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తు న్నాడు. 18 సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. నాగేశ్వరరావు పామాయిల్ తోటలో గెలలు కోస్తుండగా ఇనుప రాడ్ అదుపు తప్పి విద్యుత్ వైర్ల పై పడి విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య రజని ఫిర్యాదుతో ఎస్ ఐ కె సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం.

విద్యుదాఘాతంతో కౌలురైతు మృతి

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల :పామాయిల్ తోటలో గెలలు కోస్తున్న వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన ద్వారకాతిరుమల మండలం జాజులగుంట గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ప్రకారం రాజుపాలెంకు చెందిన బిక్కిన రాంబాబు(45) తాను కౌలుకు తీసుకున్న రాజుపాలెంలోని పామాయిలుతోటలో గెలలు కోయడానికి వెళ్ళారు. ఈక్రమంలో ఇనుప పైపుతో ఏర్పాటుచేసుకున్న కత్తితో పామాయిలు గెలలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే ఉన్న రైతులు ద్వారకాతిరుమల ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షచేసిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, బంధువులు ఆసుపత్రికి చేరుకోవడంతో రోదనలు మిన్నంటాయి. ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ కేసునమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సుందర్

విశాలాంధ్ర-నరసాపురం: మంగళవారం విద్యా సంస్థల బంద్ ను జయప్రదం చేయాలని, ఏఐఎస్ఎఫ్ పశ్చిమ గోదా వరి జిల్లా అధ్యక్షులు సిహెచ్ సుందర్ పిలుపు నిచ్చారు. నర్సాపురం నియోజకవర్గంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నర్సాపురం నాయకులు ఉంగరాల వెంకట్, న్యాయవాది నెక్కంటి క్రాంతి కుమార్,తదితరులు విద్యా సంస్థలు బంద్ జయప్రదం చేయాలని కోరారు.

అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలి

విశాలాంధ్ర -నూజివీడు : ఆంధ్రప్రదేశ్ అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి అనుబంధం) ఆధ్వ ర్యంలో అంగన్వాడి సమస్య లను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్యాలయం స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నూజివీడు నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతన చట్టం ప్రకారం రూ.26000 జీతం ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంతాలలో నెట్ సౌకర్యం ఫోన్లకు అందుబాటులో లేకపోవ డంతో అంగన్వాడీలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఫేస్ యాప్ ను రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులను ఆపాలని డిమాండు చేసారు . ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రొంపిచర్ల క్రిస్టియనమ్మ పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర - చింతలపూడి : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు సరైన వేతనాలు లేక వంట చేసే సమయంలో సరైన సౌకర్యాలు లేక కొన్నిచోట్ల ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ప్రభుత్వం ఎటువంటి ప్రమాదబీమా కల్పించకపోవడం చాలా అన్యాయం అన్నారు. చింతలపూడి జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో వంట చేస్తున్న వంట కార్మికులు రమాదేవి, శాంత వంట చేసే సమయంలో గిన్ని తిరగబడి వేడి గంజి మీద పడడంతో వీరికి తీవ్రమైన గాయాలు అయ్యాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వీరు నిరుపేద కుటుంబంలో నుంచి వచ్చిన కార్మికులని వీరికి ప్రభుత్వం ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వం వీరికి ప్రత్యేకమైన సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మధ్యాహ్న భోజనం పథకం కార్మికురాలు రమాదేవిని ఆయన పరామర్శించారు. ఈ విషయాన్ని స్థానిక మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లగా దీనిపై నివేదిక తయారుచేసి జిల్లా ఉన్నత అధికారులకు పంపనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి జి.రామారావు తెలిపినట్లు పేర్కొన్నారు. పరామర్శించిన వారిలో ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు తోర్లపాటి బాబు, మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, పకీరమ్మ, లక్ష్మి, తదితరులు ఉన్నారు.

సచివాలయం ముందు బైఠాయించిన ఉపసర్పంచ్

విశాలాంధ్ర-నూజివీడు : తీర్మానాలు అమలు చేయనందుకు నిరసనగా గ్రామ ఉపసర్పంచ్ సచివాలయం ఎదుట బైఠాయించిన ఘటన నూజివీడు మండలం అన్నవరం లో సోమవారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే నూజివీడు మండలం అన్నవరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ చలసాని గోపాలకృష్ణ మాట్లాడుతూ 100కు పైగా తీర్మానాలు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఒక్క తీర్మానం కాపీ కూడా తమకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రజల ఆరోగ్యం దృష్ట్యా స్వచ్ఛంద సేవా సంస్థ వారు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వాటర్ ప్లాంట్ పెట్టేందుకు ముందుకు రాగా 45 రోజుల క్రితమే పంచాయతీ బోర్డు ఆమోదిస్తూ తీర్మానించినట్లు చెప్పారు. పంచాయతీ బోర్డు ఆమోదిస్తూ తీర్మానించి నప్పటికీ, తీర్మానం కాపీలు ఇవ్వకపోగా, తీర్మానాన్ని అమలు చేయకపోవడం దారుణమని వాపోయారు. జగనన్న సురక్ష, ఇతర కార్యక్రమాలు గ్రామపంచాయతీ బోర్డు ఖర్చులతో నిర్వహిస్తూ తమకు ఎన్నడూ గౌరవం ఇవ్వలేదని, కూర్చునేందుకు కుర్చీ కూడా వెయ్యలేదని గ్రామ ఉపసర్పంచి గోపాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ బోర్డు నిధులతో సభలు నిర్వహిస్తూ పంచాయతీ సభ్యులకు గౌరవం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు.

ఇంటి నిర్మాణంపై లబ్ధిదారులు అవగాహన కలిగి వుండాలి

విశాలాంధ్ర-టీ నరసాపురం: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఇంటి నిర్మాణంపై లబ్ధిదారులు అవగాహన కలిగి వుండాలని పోలవరం నియోజవర్గం హౌసింగ్ డిఇ సువర్ణ రాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హౌసింగ్ సిబ్బందితో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సువర్ణ రాజు మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ప్రారంభించి 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం లబ్దిదారులకు అవార్డు అందించే ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. ఆగస్టు 1 నుండి మూడు నెలలపాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇల్లు నిర్మించుకున్న లబ్దిదారుల గృహాలను సందర్శించి అధికారులు లబ్ధిదారులతో కలిసి ఇంటి వద్ద ఫోటోలు దిగి లబ్దిదారుల అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి పంపించాల్సి వుందన్నారు. హౌసింగ్ అధికారులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఈ కార్యక్రమంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈవో ఎండి సుభాని, సి ఎల్ టి సి దేవి,హౌసింగ్ ఏఇ జి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ బాధితులకు సంఘీభావంగా

నేడు నిరసన జయప్రదం చేయండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య

విశాలాంధ్ర-ఏలూరు: మణిపూర్ హింసాకాండ బాధితులకు సంఘీభావం తెలుపుతూ సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు నేడు జిల్లాలో జరిగే నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మణిపూర్ అల్లర్లను నియంత్రించడం, ఆదివాసి మహిళలకు రక్షణ కల్పించడంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఆదివాసి మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ లో ఘోరాలు జరుగుతున్నా ప్రధాని మోడీ నోరు మెదపకపోవడం శోచనీయం అన్నారు. మణిపూర్ అమానవీయ ఘటనలు మానవత్వానికి మాయని మచ్చ అన్నారు. మణిపూర్ మారణకాండను నిలువరించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో మంగళ వారం నిర్వహించే నిరసన కార్యక్రమాలలో ఏలూరు జిల్లాలోని అన్ని పట్టణ, మండల, నియోజకవర్గ కార్యదర్శులు, సిపిఐ శ్రేణులతో పాటు, అనుబంధ ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను అరికట్టాలి



విశాలాంధ్ర-ఏలూరు: మణిపూర్‌లో మహిళను వివస్త్రను చేసి పైశాచికంగా మానభంగం చేసిన వ్యక్తులను చట్టబద్ధమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ రెవరెండ్ ఫాదర్ పి. జీవన్ కుమార్ అన్నారు.సోమవారం జిల్లా పరిషత్ అతిథి గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా భారతదేశంలో పౌరులందరూ సమానమేనని అటువంటప్పుడు కులాలపరంగా మతాల పరంగా వేరుచేసి వారిపై దాడులు చేసి మానభంగం చేయటం హేయమైన చర్యని ఫెడరేషన్ సభ్యులు ముక్తకంఠంతో మండిపడ్డారు. ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ అధ్యక్షులు పేరికె వరప్రసాద్ మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, రాష్ట్ర దళిత జేఏసీ కన్వీనర్ పొలిమేర హరికృష్ణ, ఎస్సి ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు అబ్రహం మాస్టారుమాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తగిన చర్యలు తీసుకుని మారణహోమాన్ని అదుపు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శాంతి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ లో డిఆర్ఓ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో రెవరెండ్ పాస్టర్ రత్న ప్రసాద్, పాస్టర్ ఎస్ఎల్ పాల్, తదితరుల పాస్టర్లు క్రిస్టియన్ సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఆందోళన

విశాలాంధ్ర-ఉంగుటూరు: సర్పంచులుగా నెగ్గి రెండున్నర సంవత్సరాలైనా ఏ ఒక్క రోజు కూడా ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రసంగంలో గ్రామ సర్పంచ్ అనే మాట లేకపోవడం చాలా బాధాకరంగా ఉందని పలు వురు సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద సర్పంచులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సంఘం మహిళ నాయకురాలు రాందే లక్ష్మి సునీత రాజారావు మాట్లాడుతూ గ్రామాలకు వచ్చే నిధులు గ్రామ సర్పంచులు అనుమతులు లేకుండా అటు వాలంటీర్లకు,సచివాలయ వ్యవస్థలు తీసుకొచ్చి సర్పంచులను అణచివేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సర్పంచ్ అనే మాట గాని గ్రామ స్వరాజ్యం అనే మాటగాని లేదన్నారు. దేశానికి గ్రామాలు పట్టుకొమ్మలు అంటారు కదా అలాంటిది ఈ గ్రామానికి వచ్చే నిధులను బటన్ నొక్కి పంచాయతీ నిధులను జగన్మోహన్ రెడ్డి ఖజానాకు చేర్చుకుంటున్నారని విమర్శించారు. సెంట్రల్ గవర్నమెంట్ నుంచి వచ్చిన నిధులు, విధులు గ్రామస్థాయికి గ్రామపంచాయతీకి ఒక రూపాయి కూడా ఇవ్వట్లేదన్నారు. కనీసం ఇప్పుడైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని ఉంగుటూరు మండలం టిడిపి సర్పంచులు బండారు సింధు, దిడ్ల అలకనంద, బల్ల రాధా లు కోరారు. ఏలూరు వెళ్లి జిల్లా కలెక్టరేట్ వద్ద అధికారులు వినతిపత్రం సమర్పించారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర -కైకలూరు : కైకలూరు మండలం ఆటపాక-1 గ్రామ సచివా లయ పరిధిలో ప్రతిష్టాత్మ కంగా జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పాల్గొని జగ నన్న సురక్ష కార్యక్రమం ఏవిధంగా కొనసాగుతున్నదో పరిశీలిం చారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్స్ ను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, మండల సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, సర్పంచ్ తలారి మణిమ్మ, ఎంపీటీసీలు తమ్మిశెట్టి లక్ష్మి, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు మండలంలో వట్టి పవన్ పర్యటన

విశాలాంధ్ర - నిడమర్రు: మాజీ మంత్రి దివంగత నేత వట్టి వసంత కుమార్ రాజకీయ వారసుడు వట్టి పవన్ కుమార్ సోమవారం నిడమర్రు మండలంలో పర్యటించారు. ఉదయం 8 గంటలకు మండ లంలో నిడమర్రు, పెదనిండ్ర కొలను, దేవర గోపవరం, చిననిండ్రకొలను, బైనేపల్లి, తొకలపల్లి గ్రామాలలో వట్టి వసంత్ కుమార్ అభిమానులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ మీఅందరి అభిప్రాయాలు తెలుసుకుని పార్టీలో చేరతానని వెల్లడించారు. ఆయన వెంట డిసిసిబి మాజీ డైరెక్టర్ ఎం గోపాలకృష్ణ, నిడమర్రు మండలం మాజీ వైస్ ఎంపీపీ నిమ్మల బాబురావు, ఇంటి రాజా, ముత్యాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు నీరు : గ్రామస్తుల అవస్థలు



విశాలాంధ్ర -కైకలూరు : పేరుకే మేజర్ పంచాయతీ. అభివృద్ధిలో మాత్రం వెనకడుగు అన్నట్టు వుంది కైకలూరు నియోజకవర్గం. కైకలూరులో వర్షం వస్తే చాలు వర్షపు నీరు డ్రైనేజి నీరు రోడ్లపైకి చేరతాయి. ఏ సందు చూసినా సిమెంట్ రహదారి పైకి వర్షంతో నీట మునగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు పర్యవేక్షణ లోపంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇస్తున్న కోట్ల రూపాయల నిధులు రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో అధికారుల పర్యవేక్షణ,నాయకుల పర్యవేక్షణ లేకపోవడం గ్రామాల్లో అభివృద్ధి పనులు నోచుకోవడంలేదు. ప్రధానంగా రైల్వే గేటు అవతల,వై స్సార్ కాలని,ప్రధాన రహదారి,సీతయ్య హొటల్ రోడ్లు వర్షపు నీరుతో డ్రైనేజి లు పొంగి పొర్లు తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో ప్రధాన రోడ్డుపై నిలిచిఉన్న మురుగు నీటిని తొలగించేలా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వరదముంపు ప్రాంతంలో రెండు నెలల రేషన్ పంపిణీ

విశాలాంధ్ర-ఏలూరు: వేలేరుపాడు, కుక్కునూరు వరదముంపు ప్రాంతాల్లో కుటుంబాలకు రెండు నెలల ముందస్తు రేషన్ అందించినట్లు సోమవారం జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.ఎస్.ఎస్. రాజు తెలిపారు. ఇప్పటికే కోయిదా, కట్కూరు, కాచారం గ్రామాలకు చెందిన కుటుంబాలకు రేషన్ పంపిణీ చేసినట్టు తెలిపారు. దాచారం, నెమలిపేటలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో పునరావాసం పొందుతున్న కుక్కునూరు మండలం గొమ్ముగూడెంకు చెందిన 287 కుటుంబాలకు, వేలేరుపాడు మండలానికి చెందిన రేపాకగొమ్ము కు చెందిన 183 కుటుంబాలకు సోమవారం రేషన్ అందించారు. ఇంకా ఎవరైనా మిగిలివుంటే వారికి కూడ రేషన్ అందిస్తామని డిఎస్ఓ రాజు తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కాశిపాడు హైస్కూల్లో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ, జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక హైస్కూల్లో అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించినట్టు లెప్రసి నోడల్ పర్సన్ నామాల రాజు అన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన వలన అంటువ్యాధులు వస్తాయని ప్రతిఒక్కరూ మరుగు దొడ్లు ఉపయోగించు కోవాలని తెలిపారు. భోజనానికి ముందు మరుగు దొడ్లు కు వెళ్లి వచ్చిన తరువాత చేతులు సబ్బుతో కడుక్కోవాలని, కాచి చల్లార్చిన నీరు త్రాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. ఏఎస్ ఎస్‌బి ఆర్ ప్రసాద్,గ్రామ కార్యదర్శి ఆర్.డి రామారావు, సచివాలయ ఇంజనీర్ లావణ్య,మహిళ సంరక్షకురాలు భాను ప్రియ,ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్ రెడ్డి ,విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : అర్హత కలిగి ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి అందేలా చూడాలని ఎంపీపీ కోర్స పోచమ్మ అన్నారు. సోమవారం దర్భ గూడెం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో అర్హత ఉండి పథకాలు అందనివారు

ఉండకూడదని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశమని అన్నారు. అనంతరం సర్టిఫికెట్లను పంపిణీ చేసి సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పీవీఎస్ నాయుడు, సర్పంచ్ సున్నం ఉషారాణి, ఉపసర్పంచ్ కేతిరెడ్డి రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ములగలంపల్లి నుండి వాడపల్లి కాలనీ వరకు రోడ్డు మరమ్మతులు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : ములగలంపల్లి నుండి వాడపల్లి గ్రామం వరకు రహదారి మరమ్మతు పనులు సొంత ఖర్చులతో చేపట్టినట్లు ములగలంపల్లి సొసైటీ అధ్యక్షులు ఘంటసాల గాంధీ తెలిపారు. ఈ రహదారి గుండా స్కూల్ బస్సులు ఆటోలు ట్రాక్టర్లు ద్విచక్ర వాహనాలు నిత్యం జంగారెడ్డిగూడెం వైపు వెళుతుంటాయని అన్నారు అయితే ఈ రహదారి చిన్నపాటి వర్షానికి పూర్తిగా గుంతలు మయం కావడంతో వాహన రాకపోకలు కు తీవ్ర అంతరాయం కలుగుతుందని అన్నారు అయితే ప్రజాసేవ తన ధ్యేయంగా భావించి సొంత ఖర్చులతో మరమ్మత్తు పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ పనులు చేసినందుకు స్థానిక ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నాయకులు అధికారులు ఘంటసాల గాంధీని అభినందించారు.

ప్రజా సమస్యలు తెలుసుకోండి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక జీవీఆర్ కళ్యాణ మండపంలో పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ప్రజలకు ఇచ్చిన హామీలలో ఈ నాలుగేళ్ల కాలంలో 98 శాతానికి పైగా హామీలను అమలు చేయడం జరిగిందని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. భీమవరం నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. నవరత్న పథకాలతో అరులైన ప్రతి కుటుంబానికి లక్ష నుండి రూ.5 లక్షల వరకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ పాలన పట్ల ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య,జె సిఎస్ కన్వీనర్లు మానుకొండ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దాడులు అమానుషం

విశాలాంధ్ర -ముసునూరు: మణిపూర్ రాష్ట్రంలో మహిళల పైదాడు లు చేస్తూ,అల్లర్లు సృష్టిస్తూ మహిళలను వివస్త్రలను చేసి బహిరంగంగా ఊరేగించడం అన్యాయమని సిపిఐ ఎంఎల్ పార్టీ మండలకార్యదర్శి వేమల బక్కయ్య అన్నారు.సోమవారం మండలం లోని రమణక్కపేటలో ఐద్వా మహిళ సంఘాల ఆధ్వర్యంలో మణిపూర్‌లో అల్లర్లకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా వేముల బక్కయ్య మాట్లాడుతూ బీజేపీ సర్కార్ అల్లర్ల మూకలతో ఆత్యాచారాలకు పాల్పడుతుందని,మహిళలను ఆవివస్త్రాలు లేకుండా ఊరేగించిన వ్యక్తులను నడిరోడ్డు ఉరితీయాలన్నారు.ఈ కార్యక్రమంలో నందిపాము చిట్టిమ్మ,దారా బేబి షాలని,గంటాంటి లహోరిక,ఆముదాల పుష్పలత, ఉయ్యూరు విజయలక్ష్మి,ఆముదాల పార్వతి ,తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

విశాలాంధ్ర -ముసునూరు: మండలంలోని కాట్రేనీపాడు గ్రామంలో ఎస్ఐ యం.కుటుంబరావు తమ సిబ్బందితో కలిసి దాడులు చేయగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.6100లు నగదు స్వాధీనం చేసుకుని వారి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెంకటరమణయ్యకు నివాళులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాల పితామహుడు పద్మశ్రీ వెంకట రమణయ్య 133 వ జయంతిని గ్రంథ పాలకురాలు యు. రాముడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వెంకటరమణయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ శ్రీ అయ్యంకి వెంకట

రమణయ్య తూర్పుగోదావరి జిల్లా రామచంద్ర పురం మండలం కొందుకూరు గ్రామంలో వెంగమాంబ, వెంకటరత్నం, దంపతులకు జన్మించారని, ఈయన 1914 ఏప్రిల్ 10వ తేదీన చిలకమర్తి నరసింహం అధ్యక్షతన ప్రథమ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహాసభను జయప్రదంగా నిర్వహించి 1915లో మొట్టమొదటి గ్రంథాలయాన్ని స్థాపించారని, భారత ప్రభుత్వం ఈయన సేవలను గుర్తించి 1972లో పద్మశ్రీ అవార్డు ఇవ్వడం జరిగిందని, ఆయనను స్మరించుకోవడం మన బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల విద్యార్థులు, చదువరులు,గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా వర్ధంతి

విశాలాంధ్ర -భీమవరం: అంటరాని తనం నిర్మూలనపై తన కలంతో ఉద్యమించి గబ్బిలం, పిరదౌసి రచనలతో సమాజాన్ని జాగృతం చేసిన మహాకవి జాషువా యుగాంతం వరకు నిలిచిపోతా యని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీటిపి మహిళా కళాశాల, శ్రీభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో జిల్లా సర్వోదయ మండలి, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో మహాకవి

జాషువా వర్ధంతి సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ధనలక్ష్మి, ఎంఈడి కళాశాల ప్రిన్సిపల్ పి.జోహన్న మాట్లాడుతూ ఆనాటి మహాకవుల కలల నుంచి జాలువారిన రచనల్లో సమాజ మనుగడకు ఉపయోగపడేలా ఉండేవని, దురాచారాలను ఎండగడుతూ సమసమాజ స్థాపనకు తమ రచనలు ద్వారా జాతి చైతన్యానికి కృషి చేశారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరంలో జాషువా సాహితీ సమితి చిరంజీవి సూర్యనారాయణ రాజు స్థాపించారని, జాషువాను భీమవరం కూడా తీసుకుని వచ్చారని, జాషువా పేరిట అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారని గుర్తుకు చేశారు. కార్యక్రమంలో భాగంగా జాషువా జీవిత చరిత్రపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు కె.నాగేశ్వరరావు, సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ రోడ్డుపై ప్రయాణం వెన్నులో వణుకే..!

విశాలాంధ్ర- వీరవాసరం : వీరవాసరం - వడ్డిగూడెం పంచాయతీరాజ్ రహదారి పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. దాదాపు మూడేళ్లుగా ఈ రహదారికి ఎలాంటి మరమ్మతులు చేయక పోవడం, ఇటీవల మట్టి ట్రాక్టర్ల రాకపోకలు పెరగడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాననీరు గుంతల్లోకి చేరడంతో ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహన చోదకులు హడలి పోతున్నారు. వీరవాసరం నుంచి వడ్డిగూడెం వరకూ సుమారు 3 కి.మీ. పొడవున ఉన్న రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. ఈ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ మార్గంలో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలతో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు

వాపోతున్నారు. గుంతల కారణంగా నిత్యం ఏదో ఒక చోట ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. ఈ రహదారికి వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

గోదావరి యాస హాస్యంతో కూడిన విభిన్న నేటివిటీ చిత్రాలకు ప్రేక్షక ఆదరణ

- రంగబలి సినిమా డైరక్టర్ బాసంశెట్టి పవన్

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : గోదావరి యాస, మమకారం హాస్యంతో కూడిన విభిన్న నేటివిటీ చిత్రాలకు నిరంతరం ప్రేక్షక ఆదరణ లభిస్తుందని రంగబలి సినిమా దర్శకుడు బాసంశెట్టి పవన్ అన్నారు. రంగబలి సినిమా విజయం సాధించిన

సందర్భంగా సోమవారం కడియద్ద తెలికిచెర్లలో తన మిత్రులతో కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బాసంశెట్టి పవన్ మాట్లాడుతూ తాను అసిస్టెంట్ డైరెక్టర్‌గా 4 సంవత్సరాలు పని చేశానని తెలిపారు . తరువాత యూట్యూబ్లో, స్మార్ట్ ఫిలిం తీయడం తో హీరో నాగసౌర్య చూసి తనను పిలిపించారని, ఆ తరువాత తాను చెప్పిన కథ ఆయనకు నచ్చడం వల్ల రంగబలి సినిమా చేశామన్నారు. నేటివిటికి దగ్గరగా కథలు రాసి దాన్ని ప్రజలకు అందించాలన్నదే నా లక్ష్యం. నేను చిన్నప్పటి నుంచి జంద్యాల చిత్రాలు చూస్తూ పెరిగాను. హాస్యం, విభిన్నమైన కథతా చిత్రాలు తీయాలన్నదే నా కోరిక, వీడు మావోడే అని అందరికీ దగ్గర చేసుకోనే స్థాయికి ఎదగాలనేది నా లక్ష్యం, సామాన్య మధ్యతరగతి ప్రజల గోదావరి యాస.. మనవారి వెటకారం లో హాస్యం పండించేందుకు నా రచనలు ఉంటాయి అన్నారు వాటికి విభిన్నంగా చూపించి ప్రజలకు చేరువ చేస్తాం అన్నారు వాటిని . ప్రస్తుతం రెండు కొత్త సినిమాలకు సంబంధించి కథ సిద్ధం చేసు న్నాను. వాటిని త్వరలోనే తెలుపుతానని వివరించారు. ఆయన వెంట తండ్రి గంగాధర్, యూవత అరసాల ఉమా, మదాల రాజు, సత్యనారాయణ గండి వెంకట ముత్యాలు తదితరులు. పాల్గొన్నారు.

సార్వా పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర -జంగారెడ్డిగూడెం : 2023 సార్వా సీజన్లో ప్రతీ రైతు పండించే పంటను తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రం లో నమోదు చేయించు కోవాలని తహశీల్దార్ కే. స్లీవ జోజి తెలియజేసారు.

సోమవారం తహసీల్దార్ కార్యాలయం లో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు, విఆర్ఓ లకు ఈ పంట నమోదుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ స్లీవ జోజి, మండల వ్యవసాయ అధికారి కే.వి.ఎన్.పోశారావు మాట్లాడుతూ ప్రతి రైతు తమ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రం కి వెళ్లి ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే కౌలుకు సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా కౌలు అర్హత పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ,ఉద్యాన సహాయకులు,వీఆర్వోలు పాల్గొన్నారు.

దిప్పకాయలపాడులో భవిష్యత్ గ్యారంటీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ ఆధ్వర్యంలో దిప్పకాయలపాడు గ్రామంలో ఇంటింటికి నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ

జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన భవిష్యత్ గ్యారెంటీ మేనిఫెస్టో ద్వారా రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక పథకాలను భవిష్యత్ గ్యారెంటీ మేనిఫెస్టో లో ప్రవేశ పెట్టడం జరిగిందని, రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా తెలుగుదేశం పార్టీని గెలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు షేక్ సిద్ధు, యూనిట్ ఇంచార్జ్ యనమదల ప్రసాద్, గడ నాగబాబు, గడ గరటయ్య, నక్క రవి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శెట్టిబలిజల సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర- వీరవాసరం: శెట్టిబలిజల సంక్షేమానికి నిరంతరం తమవంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కుక్కల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మండల సర్వ సమావేశంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం వీరవాసరం మండల నూతన కమిటిని నియమించారు. మండల అధ్యక్షులుగా దొంగ వెంకట దుర్గా ప్రసాద్, ఉపాధ్య క్షులుగా వేంద్ర దివాకర్, పీతాని కోటేశ్వరరావు, మల్లుల శ్రీను, పాలా మహేంద్ర, ప్రధాన కార్యదర్శి గా కోడి నరసింహం, సహాయ కార్యదర్శిలుగా వీరవల్లి తిరుపతి వెంకటేశ్వరరావు, వీరవల్లి ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా కుడిపూడి రామకృష్ణ, దొంగ నాగరాజు, మల్లుల సుబ్బారావు, మల్లుల కృష్ణ, సానబోయిన నాగయ్య, గుడాల రవి కుమార్, కవురు దిలీప్, పాలా నాగరాజు, పంపన సుధాకర్, గుబ్బల శ్రీను, మల్లుల కాశీ సుబ్రహ్మణ్యంలను నియమించారు. అనంతరం శెట్టిబలిజ సంక్షేమ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శిలు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో పర్యటించి పూర్తిస్థాయిలో కమిటీని ఏర్పాటు చేస్తామని త్వరలో జరగబోయే శెట్టిబలిజ మహానాడుకు సంఘస్తులను సిద్ధం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు దొమ్మేటి సుధాకర్, జక్కంశెట్టి రాజా ప్రసాద్, జోగి పండు, పాలా రాంబాబు, గూడూరి హనుమంతు, దొంగ దుర్గా ప్రసాద్, మండలంలోని శెట్టిబలిజ కుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తనిఖీలో తప్పులు జరుగుతుంటే అడ్డుకోండి

విశాలాంధ్ర-పోడూరు: మండలంలోని గ్రామాలలో బిఎల్వోలు జరుపుతున్న ఓ టర్ల జాబితా తనిఖీలో తప్పులు జరిగితే టిడిపి నాయకులు అడ్డుకోవాలని పాలకొల్లు నియోజకవర్గ పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి సూచించారు. మండలంలోని పెనుమదం లో జరిగిన టిడిపి నాయకులు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఎల్ఓ లు చేస్తున్న ఓటర్ల జాబితా తనిఖీ సరైన పద్ధతిలో జరుగుతుందా లేదా అని గమనించాలన్నారు. పార్టీ బూత్ ఇన్‌చార్జిలు తమ బూత్ పరిధిలోని ఓటర్ల జాబితాలను క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. మండల టిడిపి అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు మండల టిడిపి నాయకులు దేవరపు దొరబాబు, పితాని చిన్నా, బి. అంజనేయులు, వై వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సత్తా చూపిస్తాం

విశాలాంధ్ర - సీతానగరం: రాజానగరం నియోజకవర్గంలో టీడీపీ సత్తా ఏంటో చూపిస్తాం అని రాజానగరం నియోజకవర్గ నూతన ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. సోమవారం మండ లంలో రఘుదేవపురం గ్రామంలో గల సాయిబాబా గుడిలో నూతనంగా నియమించిన

టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి సాయి బాబా దర్శనం చేసుకుని టీడీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే రాజానగరం నియోజకవర్గం ఒక ప్రత్యేక స్థానం ఉందని అలాంటి ఈ నియోజవర్గానికి తనను ఇన్ ఛార్జ్ గా నియమించడం సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రు శ్రీనివాసరావు, చుండ్రు ప్రసాద్, కాండ్రు కాశీ విశ్వనాథ్, పుక్కాల శ్రీనివాస్, మింగి లక్ష్మీనారాయణ, మీరా షేక్ మొదలగు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసి గిరిజన మహిళలపై జరిగిన అత్యా చారాలు నిరసిస్తూ దోష లను కఠినంగా శిక్షించాలని మణిపూర్ రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని పలువురు వక్తలు కేంద్ర

ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం దేవరపల్లి బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు మండల గౌరవ అధ్యక్షురాలు టిపి లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎస్ భగత్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆదివాసి గిరిజన మహిళపై జరుగుతున్న దాడులను ఆపలేకపోయిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా దుర్మార్గంగా దాడులను పరోక్షంగా ప్రోత్సహించిందని విమర్శించారు. రైతు సంఘం సీనియర్ నాయకులు ఉండవల్లి కృష్ణా రావు, మహనీయుల ఆశయాల ప్రచార కమిటీ నాయకులు పప్పు రామారావు మాస్టర్ మాట్లాడుతూ గిరిజన మహిళలపై జరిగిన అన్యాయాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. రెండు వర్గాల మధ్యన ఘర్షణ పెట్టి అధికారాన్ని నిలుపుకోవాలని బిజెపి ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచన వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే రత్నాజీ అయినపర్తి శ్రీనివాసరావు ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లిపూడి వెంకటలక్ష్మి రైతు సంఘం నాయకులు పిన్నమనేని సత్యనారాయణ భవన నిర్మాణ సంఘం నాయకులు గ్యాలం సత్యనారాయణ ఫీల్డ్ అసిస్టెంట్ నాయకులు సిరా రవి కే పద్మ కామేశ్వరి సిర్రా ఝాన్సీ మడిల్లి రామారావు పుల్లూరు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ గొడరిగుంటలో సోమవారం జనసేన పార్టీ పిఎసి సభ్యులు, కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ సమక్షంలో వలస పాకల జనసేన నాయకులు



పండు నాయుడు నాయకత్వంలో సర్పవరం, వాకలపూడి, వలసపాకల గ్రామాలకి చెందిన సుమారు 25 మంది పెద్దలు జనసేన పార్టీలో చేరారు. వీరందరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నాయకత్వం, సిద్ధాంతాలు నచ్చి, సమస్యలపై స్పందించే విధానాలకు ఆకర్షితులై జనసేన పార్టీలో చేరుతున్నారని పంతం నానాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సోదే ముసలయ్య, తూము బన్ను, సంగడి శ్రీను, శాంటీ తదితరులు పాల్గొన్నారు.

ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో భారీ అన్నదానం

విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం మండలంలోని మండపం గ్రామంలో నూతనంగా ప్రతిష్టాపన చేసిన శ్రీ శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం మండల దీక్ష పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు ఆకెళ్ళ కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించి 42 రోజులు పూర్తి అయిన సందర్భంగా స్వామివారి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమం, మండపా రాధన, సకల దేవతామూర్తుల అర్చన, భక్తుల సమక్షంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి స్వామివారికి పూర్ణాహుతితో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులు మరియు భక్తులు సహకారంతో భారీ అన్న సమారాధన నిర్వహించారు.అన్నదానానికి సరిపడా బియ్యం ఇచ్చిన దాత మేకల రాజ్యలక్ష్మి,సాయి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సాగునీటికి కాటన్ దొర కృషి ఎనలేనిది

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గోదావరి పరివాహక ప్రాంతాలలో పంటలకు సాగునీరు అందించడానికి కాటన్ దొర చేసిన కృషి ఎనలేని దని పరింపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయకుమారి

పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో నీటిపారుదల శాఖ కార్యాలయం వద్ద సర్ అర్థర్ కాటన్ దొర 124వ వర్ధంతిని నిర్వహించారు. నీటిపారుదల శాఖ డి ఈ రవీంద్రబాబు, సర్పంచ్ విజయ కుమారి కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పవిత్ర గోదావరి నది పై వంతెనలు, ఆనకట్టలు నిర్మించడానికి కాటన్ దొర తన గుర్రంపై ప్రత్యేకంగా గోదావరి పరివాహక ప్రాంతాలను సందర్శించి, రైతులు పండించే పంటలకు నీరు అందించడానికి గోదావరి నది ద్వారా కాలువలు ఏర్పాటు చేసి వంతెనలు, ఆనకట్టలు నిర్మించడమే కాకుండా పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలు కలుపుతూ కొవ్వూరు నుండి రాజమండ్రి వరకు రైల్ కం రోడ్డు వంతెన నిర్మించడం జరిగిందని, ధవలేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి పవిత్ర గోదావరి నది జలాలను పంట కాలువలకు పంపిణీ చేయడానికి ఎనలేని కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, వార్డ్ మెంబర్ రాచూరి మదన్, రసపుత్ర బాపూజీ, చిటికెన నాగార్జున, ముప్పిడి చినబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్ అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : మణిపూర్‌లో క్రైస్తవ, గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడాన్ని నిరసనగా జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ మేరకు సోమ వారం తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందచేసారు. మహిళా విభాగం ముఖ్య నాయకులు మాట్లాడుతూ మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశంలో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని, దేశాన్ని తలదించుకునేలా చేసిందని దుయ్యబట్టారు. మూడునెలలుగా ఈ అమానుషాన్ని దాచిపెట్టిన ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేసి శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. దోషులను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఈ మూడు నెలలు మౌనం వహించడం దుర్మార్గమని బేటీ బచావో అని పిలుపు ఇచ్చి ఇలాంటి దురాగతాలను అరికట్టలేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సాబెర, హబీబా, సమీనా, ఫర్హత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాల నందు హెచ్ & బిఎస్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న డి. శ్రీనివాసరావుకి "ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(డాక్టరేట్) పొందినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేసారు. డా ఆర్ డివిడ్ కుమార్ నేతృత్వంలో డి శ్రీనివాసరావు సమర్పించిన శీర్షిక "స్టడీ ఆఫ్ హీట్

అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఆఫ్ సమ్ నాన్ - న్యూటోనియన్ ఫ్లూయిడ్స్" అనే అంశం పై థీసిస్ సమర్పించినందుకు గాను ఈ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. డాక్టర్ డి. శ్రీనివాసరావు తన జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా ఎన్ శేషా రెడ్డి, వైస్ చైర్మన్ డా ఎన్ సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డా ఎమ్ శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డా దోలా సంజయ్, డీన్ డా ఏ రామకృష్ణ, విభాగాధిపతి డా బిఎస్ఎన్ మూర్తి, వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్లు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు పి వేణుగోపాల్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని మెంటే వారి తోటలో రూ.15 లక్షలతో నిర్మించనున్న ముస్లిం షాది ఖానాకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత కల్పించి వారిని అభివృద్ధి చేసే దిశగా ముఖ్యమంత్రి

జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. ముస్లిం, మైనార్టీ వర్గాలకు సంబంధించి రాజకీయంగా కూడా అత్యంత ప్రాధాన్యత కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముస్లిం, మైనార్టీలు కోరిన చోట షాదీ ఖానాలను నిర్మిస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే భీమవరంకు సంబంధించి షాది ఖానాను నిర్మిస్తున్నామని అన్నారు. చంద్రబాబు మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, చంద్రబాబుతో జతకట్టిన పవన్ కళ్యాణ్ తన గ్రాఫ్‌ను రోజురోజుకు తగ్గించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నూర్ బాషా వేట మాంసం వ్యాపార వర్తక సంఘం అధ్యక్షులు షేక్ మందూ హుస్సేన్, సనావుద్దీన్, షేక్ అహ్మద్, మస్తాన్ వలీ, మహబూబ్, భీమవరం ముస్లిం, మైనారిటీ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ రబ్బాని, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

27న నగర పంచాయతీ సమావేశం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 27న ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జి లోవరాజు తెలిపారు. ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ సమావేశపు మందిరంలో సమావేశం జరుగుతుందని అన్ని శాఖల అధికారులు, కౌన్సిలర్స్ హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వర్షం వచ్చినా ఆగని ప్రారంభోత్సవాలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: గ్రామంలో ఉన్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యత బట్టి సిసి రోడ్లు, సీసీ డ్రైనేజీ వేసామని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు అన్నారు. వర్షం కురుస్తున్నా వర్షం లోనే ఉంగుటూరు మండలం చేబ్రోలులో రూ.26 లక్షలతో నిర్మించిన పలు సిమెంటు రోడ్లను సోమవారం

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభోత్సవం చేశారు. తొలుత వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పిటిసి జయలక్ష్మి, సొసైటీ చైర్మన్ పాపారావు బాబ్జి, మండల వైసీపీ కన్వీనర్ వెంకట మంగరావు,ఎంపీటీసీ సభ్యులు మనసాల నాగమణి, రాయి లక్ష్మి, మాజీ సర్పంచి కరణం బుజ్జి, ఆకుల రాజా, ఏలూరు జిల్లా వైసీపీ అనుబంధ సంస్థ పంచాయతీరాజ్ సెల్ అధ్యక్షుడు పుప్పాల గోపి, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యేని పలువురు శాలువ కప్పి సన్మానించారు.

అత్యాధునిక సాంకేతికాభివృద్ధికి దేశంలో విస్తృత పరిశోధనలు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : అత్యాధునిక సాంకేతిక పద్ధతుల కోసం విస్తృత సాంకేతిక పద్ధతులను తీసుకు రావడానికి దేశంలో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని ముంబై ఐఐటి సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ ప్రకాష్ నంతగోపాలన్ తెలిపారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ

ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో "ఆధునిక నిర్మాణ వస్తువులు, అభ్యాసాల ప్రస్తుత, భవిష్యత్తు అవకాశాలు" అనే అంశంపై వారం రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని సెర్బ్ - డిఎస్‌టి సహకారంతో ఏపీ నిట్ నిర్వహిస్తుంది. కార్యక్రమ కన్వీనర్ గా సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.భరణీ దరన్, కో ఆర్డినేటర్ గా డాక్టర్ ఎస్.ఎం సుబాని వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి ప్రకాష్ నంతగోపాలన్ మాట్లాడుతూ త్రీడి కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ ప్రాధాన్యత, ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో కూడిన కాంక్రీట్ నిర్మాణాలను తయారుచేయవచ్చని వివరించారు. ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆన్లైన్ ద్వారా మాట్లాడుతూ నిర్మాణ రంగంలో నిష్ణాతులైన నిపుణుల ఆలోచనలను ఒకరికొకరు పంచుకోవడానికి, నైపుణ్యాలను మరింతగా పెంపొందించుకోవడానికి ఈ వర్కుషాప్ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ముందుగా జ్యోతిప్రజలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.ఆర్.కె శాస్త్రి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాదిపతి డాక్టర్ వి.సందీప్, పలువురు విభాగాదిపతులు, ఆచార్యులతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 25 మంది పరిశోధకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దటి లేకుండా చర్యలు

విశాలాంధ్ర-ఏలూరు: గోదావరి వరద కారణంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో త్రాగునీటి ఎటువంటి కొరతా లేకుండా చర్యలు తీసుకున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.



కుక్కునూరు మండలం దాచారం గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో తాగునీటికి ఎటువంటి కొరతా లేదని , వరద ముంపు ప్రభావం ప్రారంభం కాగానే, వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము,కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామాల ముంపు ప్రాంతాలకు చెందిన ప్రజలను శుక్రవారం దాచారంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన వరద పునరావాస కేంద్రానికి తరలించామన్నారు వరద ముంపు ప్రాంతాలలో ఎటువంటి తాగునీటి కొరత లేకుండా ఆర్ డబ్ల్యూఎస్ శాఖకు సిబ్బందితో నిరంతరం పరిశీలిస్తున్నామని సత్యనారాయణ తెలియజేసారు.